# 31. శ్రీ కృష్ణుని ఆత్మ హత్య

సిక్కులకు పుణ్యక్షేత్రమూ, స్వర్ణదేవాలయానికి నిలయమూ నైన అమృతసర్ నగరంలో...

మహారాణి భగవాన్ కౌర్ ఒక సువిశాలమైన దివ్య హర్మ్యంలో ఏకాంత జీవితం, పవిత్ర జీవితం గడుపుతూ ఉండేవారు.

ఏకాంత జీవితం ఎందుకంటే, మహారాజావారు ఇహలోక సౌఖ్యాలకు విసిగి రంభ, మేనక, తిలోత్తమాది అప్సరల సమాగమార్థులై దివికేగి ఉన్నారు.

పోతూ, పోతూ శ్రీవారు దివ్యమైన హర్మ్యాన్నీ, అచుట్టూ నందన వనాల్నీ, వాటి మధ్య రాజోచితమైన దర్బారు హాలుల్నీ, అతిథి మందిరాల్నీ, వాటన్నింటి చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడల్నీ మహారాణీవారి సౌకర్యార్థం వదలి వెళ్ళేరు.

మహారాణీవారున్నూ రాజావారి ధర్మపత్నిగా అందుకోగల సమస్త సౌకర్యాలనూ, ఆదాయాలను అనుభవిస్తూ సపరివార సమేతంగా సుఖంగా ఆ దివ్య క్షేత్రంలో కాలం గడుపుతూండగా...!

ఓ సుప్రభాతాన పవిత్ర స్థలాల్లోకెల్లా అత్యంత పవిత్రమైన హరిద్వార్ దర్శించి బొందితో కైలాసానికివెళ్ళే సదవకాశం సాధించుకు రావాలని బుద్ధిపుట్టిన వారై...!

కొద్దిపాటి పరివారంతో 1910 సెప్టెంబర్‌లో సదరు దివ్య క్షేత్రాన్ని చేరి అక్కడగల పూంచ్ సంస్థానాధీశుల వేసవి విడిదిలో

మకాంపెట్టి, హిమాలయాల చల్లదనాల్నాస్వాదిస్తూ కైలాసనాధుని జాడ లకై భక్తి ప్రవృత్తులతో తీవ్ర ప్రార్థనలూ, అన్వేషణలూ కొనసాగించేరు.

పరాత్పరు డందు లేడిందు గలడను సందేహంబు వలదని గదా అనుభవజ్ఞులు తెలవిచ్చిన వేదవాక్కు !

తదనుగుణంగా ఓపవిత్ర ముహూర్తాన సాయంసంధ్య వెలుగులో మహారాణీవారు అన్వేషిస్తున్న పరాత్పరుడు, జగన్మోహనుడు, కామ రూపుడై రాణీవారికి ప్రత్యక్షమయ్యేడు.

ఆ సమయంలో ఆ దివ్యమంగళుడు రాణీవారి భక్తిని పరీక్షించేందు కేమో సదరు పూంచ్ సంస్థానాధీశుల వేసవి విడిది కాపలావాని రూపంలో సాక్షాత్కరించేడు.

ఆ కాపలావాడు ఇరవై ఎనిమిదేళ్ళవాడు. ఇటీవలనే భార్యావియోగ దుఃఖాన్ననుభవించి ఏకాంతంలో ఏ కాంతాలేని జీవితం గడుపుతున్న వాడు. రాణి సాహెబావారి కన్నా వయసులో ఆరేళ్ళు చిన్నవాడు.

రాణీ సాహెబా వారా కాపలా యువకునిలో శ్రీకృష్ణపరమాత్ముని దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించి ధన్యులైనారు. తనను రాధగా ఊహిం చుకుని పరవశించి పోయినారు.

కానీ, కాపలా యువకుడు రాధాకృష్ణుల ప్రేమతత్వాన్ని తాత్విక దృక్పథంతో అర్ధంచేసుకున్న జ్ఞానికాడు. కనుక రాణీసాహెబా వారా అజ్ఞానిని ప్రేమజ్ఞానిగా తీర్చిదిద్ది ప్రక్కమీదికి చేర్చుకునేందుకు అల్పం గానే అయినా శ్రమపడక తప్పలేదు.

ఆ కష్టకాలం దాటిపోయిం తర్వాత మాత్రం సదరు రాధాకృష్ణులు హరిద్వార మొక ఇంద్రలోకంగా పూంచ్ సంస్థానాధీశుల బంగ్లా దేవేంద్ర భవనంగా సకల సౌఖ్యాలూ తనివితీరా గ్రోలి ధన్యులయ్యారు.

రాణీసాహెబావారు అమృతసర్‌కు తరలిపోతూ, "కృష్ణా! మా దేవిడీలో ఉద్యోగానికై ధరఖాస్తు పెట్టుకొనుము. సంస్థాన పాలనా వ్యవహారములు పర్యవేక్షించెడి మా సోదరునితో చెప్పి నీకు నా అంతఃపుర నందనోద్యానపు మాలిగా ఉద్యోగము వేయించెదనుగాక" అని అభయం కూడా ఇచ్చేరు.

ఖాన్‌చంద్ అనబడే సదరు శ్రీకృష్ణ భగవానుడు అందుకు సాహసించలేక పోయేడు. కానీ, రాధా-కృష్ణుల మధ్య మనోహరమైన ప్రేమ లేఖలు మాత్రం జోరుగా సాగాయి. బ్రిటిష్‌వారు అప్పటికే దేశంలో తపాలాసర్వీసు ప్రవేశపెట్టి ఉండటాన సదరు లేఖలబట్వాడాకై హంసలు మేఘాలు వంటివేవీ అవుసరం లేక వారి ప్రేమ ఎడబాటులో లేఖా పరంపరగా దిన దిన క్షణ క్షణ ప్రవర్ధమానమై పోసాగింది.

అప్పుడు...

రాణీసాహెబావారి రహస్యాహ్వానంపై ఖాన్ చంద్ ఓ సుప్రభాతాన అమృతసర్‌కు వేంచేసి రాణీవార కోటలో, అంతఃపురానికి ఆనుకునే ఉన్న అతిథి గృహంలో వెలిసేడు. అక్కడ సదరు కృష్ణపరమాత్ముల దివ్యావతారానికి రాజోచిత మర్యాదలు జరిగేయి. రాణీసాహెబావారు అనుదినం ఏకాంతంగా గంటల తరబడి శ్రీకృష్ణులవారి సన్నిధిలో పుణ్యసాధనలో గడిపేవారు.

అలా మహాఘనత వహించిన రాణీసాహెబావారు వీశలకొద్దీ పుణ్యం సంపాదించుకున్న తర్వాత ప్రస్తుతానికీ పుణ్యం చాలునని తీర్మానించుకున్నవారై...

శ్రీకృష్ణులవారికి అనేకానేక దక్షిణలు సమర్పించుకుని తాత్కాలికంగా వీడ్కోలిచ్చేరు.

అంతటితో రాణీవారు శ్రీకృష్ణుడినీ, అతడి శృంగార క్రీడాభి రామాన్నీ మరచిపోయి ఆస్థాన లావాదేవీల్లో మునిగిపోయి తాత్కాలికంగా పుణ్యసాధనకు ఫుల్‌స్టాప్ పెట్టారు.

కానీ...

హరిద్వార్ చేరుకున్న ఖాన్‌చంద్ మాత్రం రాణీవారినీ, వారిచ్చిన దేవేంద్ర భోగాల్నీ, తాము జరిపిన పుణ్యక్రీడల్నీ మాత్రం మరచిపోలేక పోగా...

మరలా అమృతసర్ పుణ్యక్షేత్రానికిపోయి అక్కడి దేవిడీలోగల దేవతామూర్తిని దర్శించి సేవించుకోవాలని తహతహలాడి పోసాగేడు.

అందుకై రాణీసాహెబావారికి ఉత్తరాలు గుప్పించ సాగేడు.

కానీ, రాణీసాహెబావారికి అప్పటికే కృష్ణాద్వైతంపట్ల విసుగు జనించి మరో తత్వాన్వేషణలో ఉన్నారు,

కనుక...

"రావద్దు అక్కడే తగలడు" అని ఖరాఖండీగా కృష్ణులవారికి సందేశం పంపేరు.

కానీ... కృష్ణులవారు ఆగలేక వచ్చి వాలేరు.

ఈసారి వారికి గుడిలో ప్రవేశం దొరకలేదు. ప్రసాదాలు ముట్ట లేదు.

సరిగదా...

ఓ సేవకుల గదిలో ఖాన్‌చంద్ అనే సేవకుని రూపంలో అవతా రం ఎత్తవలసి వచ్చింది.

అలా అవతారం ఎత్తిన వారంరోజులకు రాణీవారూ, వారి అంత రంగికులైన మరిద్దరు పరిచారికలూ ఓ శవాన్ని బగ్గీలో వేసుకుని ఊరి వెలుపలికి చేరవేస్తుండగా పోలీసులు అనుమానించి అరెస్టు చేసేరు.

ఆ శవం సాక్షాత్తూ శ్రీకృష్ణపరమాత్ముల వారిది.

శవ పరీక్షలో శ్రీవారు డబుల్ డోసులో విషం సేవించారని తేలి పోయింది.

---

అయితే, శ్రీవారు సేవించారా? సేవింప జేయబడ్డారా? అనే విషయంపై కోర్టులో చాలా నెలలపాటు వాదోపవాదాలు చెలరేగాయి.

చివరికి శ్రీకృష్ణులవారు ఆత్మహత్య చేసుకున్నారని గౌరవనీయులైన కోర్టువారు తీర్పిచ్చారు.

రాణీసాహెబావారు రాణోచితంగా జైలునుండి పరిచారికా సమేతంగా విడుదలై...

పుణ్యాన్వేషణలో హరిద్వార యాత్ర కేగేరు.

★